సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం । 30 । డిసెంబర్ । 2024



అడ్డాకులే ఆదాయం

పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని అడవుల్లో అడ్డాకులు గిరిజన మహిళలకు ఉపాధి కల్పిస్తున్నాయి. విస్తర్ల తయారీ ద్వారా వీరు ఆదాయం పొందుతున్నారు. 8లో



రైతుల ఆశలకు 'కత్తెర'

మొక్కజొన్న పంటను కత్తెర పురుగు ఆశించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నివారణ చర్యలు చేపట్టాలని అధికారులు సూచిస్తున్నారు. 8లో



నేటి నుంచి కానిస్టేబుల్ సెలెక్షన్స్

ఏలూరు పరేడ్ గ్రౌండ్స్‌లో కానిస్టేబుల్ అభ్యర్థులకు సోమవారం నుంచి దేహ దారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నారు. 4,976 మంది హాజరుకానున్నారు. 8లో

ఏలూరు కేంద్రంగా.. నకిలీ పాన్ మసాలా

- అక్రమ వ్యాపారానికి అడ్డా తంగెళ్లమూడి
- ఉభయ తెలుగు రాష్ట్రాల్లో భారీ వ్యాపారం
- గుట్కాల తయారీతోనూ కోట్లలో ధనార్జన
- నెలకు రూ.40 లక్షల వరకు మామూళ్లు!
- జీఎస్టీ ఎగవేతతో రాష్ట్రస్థాయిలో నిఘా

ఏలూరు టౌన్: ఏలూరు నగరం నకిలీ పాన్ మసాలా, నిషేధిత గుట్కాల తయారీకి కేంద్రంగా మారింది. దేశవ్యాప్తంగా స్టార్ హీరోలు ప్రకటనలు గుప్పించే ప్రఖ్యాత పాన్ మసాలా బ్రాండ్‌కు డిస్ట్రిబ్యూటర్‌గా ఉంటూ.. ఓ వ్యాపారి నకిలీ పాన్ మసాలా తయారు చేస్తూ భారీగా కోట్లు ఆర్జిస్తున్నారు. మరోవైపు నిషేధిత గుట్కాను సైతం గుట్టు చప్పుడు కాకుండా తయారు చేసి విక్రయాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ఆరు జిల్లాల్లో నకిలీ ఉత్పత్తులతో అక్రమ సామ్రాజ్యాన్ని విస్తరింపజేసినట్టు సమాచారం. ఏలూరులోని తంగెళ్లమూడి ప్రాంతం ఇందుకు అడ్డాగా మారింది. దీనిపై రాష్ట్రస్థాయిలో నిఘా విభాగం డేగ కన్ను వేసినట్టు తెలిసింది. భారీగా జీఎస్టీ ఎగవేస్తున్నట్టు రాష్ట్రస్థాయి నిఘా విభాగం అధికారులు గుర్తించటంతో అవినీతి వ్యాపారి బండారం బయటపడనుందని సమాచారం.

అధికార పార్టీ అండదండలు!

ఏలూరుకి చెందిన ఓ వ్యాపారి ఓ పాన్ మసాలా బ్రాండ్‌కు అధికారికంగా డిస్ట్రిబ్యూటర్‌గా ఉన్నారు. అయితే ఈ బ్రాండ్‌ను పక్కనపెట్టి సొంతంగా నకిలీ పాన్ మసాలా తయారు చేస్తున్నాడు. అలాగే నిషేధిత గుట్కాను సైతం తయారుచేస్తూ హోల్‌సేల్‌గా విక్రయిస్తూ కోట్లు ఆర్జిస్తున్నట్టు టాక్. అధికార పార్టీ అండదండలు ఉన్నాయంటూ చెప్పుకుంటూ అక్రమ వ్యాపారం చేస్తున్నట్టు తెలుస్తోంది. ఏలూరు కేంద్రంగా ఉమ్మడి పశ్చిమగోదావరి, ఉమ్మడి కృష్ణా, ఉమ్మడి గుంటూరు జిల్లాలతో పాటు తెలంగాణలోని ఖమ్మం, సత్తుపలి తదితర ప్రాంతాల్లో భారీ ఎత్తున వ్యాపారాన్ని చేస్తున్నారని సమాచారం. ఆయా జిల్లాల్లో ఎక్కడ చూసినా వీరి నకిలీ బ్రాండ్‌లను మార్కెటింగ్ చేస్తున్నారు.



పాన్ మసాలా, గుట్కా విక్రయాల దుకాణం (ఫైల్)

మామూళ్ల మత్తులో అధికారులు

అక్రమ వ్యాపారానికి ఆయా శాఖల అధికారుల సహాయ సహకారాలు మెండుగా ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి. సదరు వ్యాపారి నెలకు రూ.40 లక్షల వరకు మామూళ్ల రూపంలో అధికారులకు ముట్టజెబుతున్నట్టు సమాచారం. దీనిని బట్టి అక్రమ వ్యాపారం ఏ మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు. పోలీస్, రెవెన్యూ, వాణిజ్య పన్నులు శాఖల అధికారులంతా మామూళ్ల మత్తులో జోగుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

జీఎస్టీ చెల్లింపుల్లో తేడాలతో..



అక్రమ వ్యాపారం గుట్టు రట్టు కావడానికి ప్రధానంగా జీఎస్టీ చెల్లింపుల్లో వచ్చిన తేడాలే కారణమని తెలిసింది. భారీస్థాయిలో వ్యాపారం చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నట్టు రాష్ట్రస్థాయి అధికారుల నిఘాలో తేలింది. కేవలం 20 శాతం జీఎస్టీ చెల్లిస్తూ 80 శాతం వరకు ఎగనామం పెడుతున్నట్టు గుర్తించారు. దీంతో ఏలూరులో అక్రమ వ్యాపారంపై రాష్ట్రస్థాయి నిఘా అధికారులు డేగ కన్ను వేశారు. సదరు వ్యాపారికి అధికార పార్టీ పెద్దల అండదండలు ఉండటంతో తప్పించుకుంటారా? లేక అధికారులు దాడులు చేసి అక్రమ వ్యాపారానికి చెక్ పెడతారా? అనేది తేలాల్సి ఉంది.

కొల్లేరులో మళ్లీ రాజుకున్న వివాదం

- ఆక్వా చెరువుల లీజుపై ఆందోళన
- చెట్టున్నపాడులో రాత్రంతా జాగరణ
- పోలీసుల హామీతో ఆందోళన విరమణ

భీమడోలు: కొల్లేరు గ్రామం చెట్టున్నపాడులో ఆక్వా చెరువుల లీజు వివాదం మరోసారి రాజుకుంది. దేవస్థానానికి చెందిన ఆక్వా చెరువు లీజు రద్దు చేయాలని, చెరువు నుంచి కూటమి నేతకి చెందిన గేదెలు, గడ్డివాములను తక్షణమే ఖాళీ చేయించాలని, గ్రామస్తుల సమక్షంలో మరోసారి వేలం పాట నిర్వహించాలన్న ప్రధాన డిమాండ్లతో శనివారం రాత్రి గ్రామానికి వచ్చిన సీఐ యూజీ విల్సన్, ఎస్సై వై.సుధాకర్‌లు వెళ్తున్న జీపును రోడ్డుపై అడ్డుకుని బాధిత వర్గం ఆందోళనకు దిగింది. అనంతరం ఆక్వా చెరువు వద్దకు వెళ్లి ఆందోళన చేస్తూ.. రాత్రంతా అక్కడే జాగరణ చేశారు. దీంతో ఆదివారం గ్రామంలోకి అధిక సంఖ్యలో పోలీసులు రావడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. 15 రోజుల క్రితం ఆందోళన చేయగా చెరువులను ఖాళీ చేయిస్తామని పోలీసులు హామీ ఇచ్చారని, అయితే ఇప్పటికీ అమలు కాలేదంటూ బాధిత వర్గంలోని దేవదాసు శ్రీనివాసరావు, దేవదాసు రాజ్‌కుమార్, బొంతు జయమణిలతో పాటు పలువురు గ్రామస్తులు పోలీసులను ప్రశ్నించారు. ఉదయం చెరువు వద్ద టెంటు వేసుకుని ఆందోళన కొనసాగించారు. దీంతో భీమడోలు సీఐ యూజీ విల్సన్, ఎస్సై వై.సుధాకర్ బాధిత వర్గంలోని పెద్దలతో చర్చించారు. చెరువు వద్ద ఉన్న పొక్లెయిన్‌ను 15 రోజుల క్రితమే పంపించి వేశామని, చెరువు వద్ద గేదెలను పంపుతున్నామని, గడ్డివాములను రెండు రోజుల్లో ఖాళీ చేయిస్తామని హామీ ఇచ్చారు. దీంతో బాధితులు ఆందోళన విరమించారు.



శనివారం రాత్రి చెట్టున్నపాడులో ఆక్వా చెరువు వద్ద జాగరణ చేస్తున్న బాధితులు



ఆదివారం ఉదయం చెరువు వద్ద ఆందోళన కొనసాగిస్తున్న దృశ్యం

న్యూస్‌రీల్

ఉత్సాహంగా బాలోత్సవం



విద్యార్థుల మల్లఖంబ్ ప్రదర్శన

భీమవరం: చిన్నారులు విద్యతోపాటు సాంస్కృతిక, కళలు, క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరంలో బాలోత్సవం రెండో రోజు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పిల్లల చదువులు, శాస్త్రీయ దృక్పథం పెంపునకు బాలోత్సవం స్ఫూర్తి అని ఆయన అన్నారు. ఉపాధ్యాయులు పి.రామభద్రరాజు, జీపీసీ రాజు ఆధ్వర్యంలో విద్యార్థులు జిమ్నాస్టిక్స్‌లో భాగమైన రోప్ స్కిప్పింగ్, మల్లఖంబ్ పోల్ ప్రదర్శనలు నిర్వహించారు. వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రూ.10 వేల నగదు బహుమతి అందజేశారు. భీమవరం బాలోత్స వం అధ్యక్షుడు ఇందుకూరి ప్రసాదరాజు, ప్రధాన కార్యదర్శి సీహెచ్ పట్టాభిరామయ్య, కారుమూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సత్య సంజీవ్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ సత్య సంజీవ్

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణానికి చెందిన హోమియో వైద్యుడు చిక్కం సత్య సంజీవ్ టైమ్స్ ఐకాన్స్ ఆఫ్ ది హెల్త్‌కేర్–2024 అవార్డును అందుకున్నారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వెంకటరమణ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. ఆయన్ను పలువురు వైద్యులు, స్నేహితులు, బంధువులు అభినందించారు.

237 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో ఇప్పటివరకూ 237 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించామని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లాలోని 20 మండలాల్లోని 320 రెవెన్యూ గ్రామాలకుగాను 237 గ్రామాల్లో సదస్సులు పూర్తయ్యాయన్నారు. సదస్సులకు 12,691 మంది హాజరుకాగా 3,172 ఫిర్యాదులను స్వీకరించామన్నారు. వీటిలో 319 ఫిర్యాదులను పరిష్కరించామని చెప్పారు. సదస్సుల్లో అందిన దరఖాస్తులను 45 రోజుల్లోపు పరిష్కరిస్తామన్నారు. జనవరి 8 వరకు సదస్సులు జరుగుతాయని తెలిపారు. భూ సంబంధ, రెవెన్యూ పరంగా మ్యూటేషన్, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాల జారీ, పట్టాదారు పాస్‌పుస్తకాలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామని కలెక్టర్ చెప్పారు.

10న ఎస్సీ కులగణనపై జాబితా ప్రదర్శన

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో ఎస్సీ కులగణనపై జనవరి 10న తదిత జాబితాను ప్రకటిస్తామని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీల్లోని సచివాలయాల్లో నోటీసు బోర్డులో జాబితా అందుబాటులో ఉంచామని, దీనిపై ఈనెల 31న వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. అర్జీల ఆధారంగా ఆన్‌లైన్‌లో మార్పులు, చేర్పులు, వివరాల పరిశీలనకు జనవరి 6న తుది గడువుగా నిర్ణయించామన్నారు. మార్పులు, చేర్పులు అనంతరం కులం వారీగా జాబితాలను సచివాలయాల్లో జనవరి 10న ప్రకటిస్తామని కలెక్టర్ తెలిపారు.

ప్రభుత్వ దుర్మార్గాలను ఎండగట్టాలి

మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: కూటమి ప్రభుత్వ దుర్మార్గాలను ఎండగట్టాలని, తద్వారా ప్రజావిశ్వాసాన్ని పొందగలమని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. ఆదివారం రాత్రి పట్టణంలోని కార్యాలయం వద్ద పార్టీ మండల అధ్యక్షుడిగా రెండోసారి నియమితులైన జద్దు హరిబాబు, నాయకులు మర్యాదపూర్వకంగా ఆయన్ను కలిసి గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కొట్టు మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు. ఎన్నికల ముందు జగన్ పాలనపై ప్రజలు సంతోషం వ్యక్తం చేశారన్నారు. గతంలో చంద్రబాబు చేసిన మోసాలు తెలిసినా.. కూటమి నాయకుల మాటలు నమ్మారన్నారు. కూటమి ప్రభుత్వం ఏడు నెలల పాలన చూసిన ప్రజలు మరలా వైఎస్సార్‌సీపీ వైపు చూస్తున్నారని, రాబోయే రోజుల్లో అధికారంలోకి రావడం తథ్యమన్నారు. ప్రజల్లో మమేకమై ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని నాయకులకు సూచించారు. మండల పార్టీ అధ్యక్షుడు హరిబాబు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేస్తూ అందరికీ అందుబాటులో ఉంటానన్నారు. జిల్లా అధికార ప్రతినిధి ముప్పిడి సంపత్‌కుమార్ మాట్లాడారు. వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు, నాయకులు వెలిశెట్టి నరేంద్ర కుమార్, కంతమణి సత్యనారాయణ, నక్కా గంగాధర్, తారమట్ల శ్రీనివాస్, ప్రత్తి రంగయ్య, ప్రత్తి రాజబాబు తదితరులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి కొట్టును సన్మానిస్తున్న దృశ్యం

బకాయి జీతాలు చెల్లించాలి

ఏలూరు (టూటౌన్): ఏపీ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) అనుబంధం జిల్లా కమిటీ సమావేశాన్ని స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగమణి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పౌష్టికాహార లోపం అరికట్టాలని కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా, కార్మికులకు వేతనాలు పెంచకుండా వెట్టిచాకిరీ చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జనవరి నుంచి కొత్త మెనూ అమలు చేస్తామని ప్రభుత్వం చెబుతోందని, అయితే ఇప్పటికే ఐదు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, గ్యాస్ ప్రభుత్వమే ఇవ్వాలని, గుర్తింపు కార్డులు జారీ చేయాలని, ప్రతినెలా 5వ తేదీలోపు వేతనాల బిల్లులు ఖాతాల్లో జమచేయాలని డిమాండ్ చేశారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని స్వచ్ఛంద సంస్థలకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇంటర్ విద్యార్థుల మెనూ చార్జీ రూ.60 ఇవ్వాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో మధ్యాహ్న భోజన కార్మికులపై వేధింపులు పెరిగాయన్నారు. కార్మికులకు రూ.10 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న నాగమణి

కాలువ గట్లపై కాసుల వేట

- యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు
- పంగిడిగూడెంలో అడ్డుకున్న గ్రామస్తులు
- ఎట్టకేలకు టిప్పర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించిన పోలీసులు
- అధికారుల తీరుపై మాజీ మంత్రి వనిత మండిపాటు

ద్వారకాతిరుమల: పోలవరం కుడి కాలువ గట్లపై కూటమి నేతలు కాసుల వేట సాగిస్తున్నారు. రాత్రీ పగలు తేడా లేకుండా మట్టి దందాను యథేచ్ఛగా నడిపిస్తున్నారు. మండలంలోని పంగిడిగూడెం శివారులోని పోలవరం కుడి కాలువ గట్టుపై ఆదివారం ఒక జనసేన నాయకుడి ఆధ్వర్యంలో జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలను స్థానికులు అడ్డుకున్నారు. వివాదం ముదరడంతో ఎట్టకేలకు పోలీసులు రంగప్రవేశం చేసి టిప్పర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మట్టి దందాకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. మండలంలోని పంగిడిగూడెం, ఎం.నాగులపల్లి గ్రామాల్లోని పోలవరం కుడి కాలువ గట్లపై మట్టి అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. భీమడోలు మండలం సూరప్పగూడెం గ్రామానికి చెందిన జనసేన నాయకుడి ఆధ్వర్యంలో పంగిడిగూడెం శివారులోని పోలవరం కుడి కాలువ గట్టుపై పొక్లెయిన్ (200 కెపాసిటీ) సహాయంతో మట్టి తవ్వుతుండగా ఆదివారం స్థానికులు అడ్డుకున్నారు. పొక్లెయిన్, టిప్పర్లు అక్కడి నుంచి వెళ్లకుండా అడ్డుపడ్డారు.

వివాదం ముదరడంతో..

మట్టి తవ్వకాలు ఇంతలా జరుగుతున్నా కన్నెత్తి చూడని పోలీసులు.. తాజాగా వివాదం ముదరడంతో ఎట్టకేలకు స్పందించారు. భీమడోలు సీఐ యూజే విల్సన్, ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్ తమ సిబ్బందిని సంఘటనా స్థలానికి పంపించారు. అయితే మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్న పరిధిని గుర్తించేందుకు వారు కాస్త ఇబ్బంది పడ్డారు. చివరకు పోలసానిపల్లి, పంగిడిగూడెం గ్రామాలకు చెందిన వీఆర్వోలు అక్కడికి చేరుకుని తవ్వకాలు జరుగుతున్న ప్రాంతం ద్వారకాతిరుమల మండల పరిధిగా నిర్ధారించారు. సీఐ విల్సన్ ఆదేశాల మేరకు రెండు టిప్పర్లను సిబ్బంది భీమడోలు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాలీ అందుబాటులో లేకపోవడంతో పొక్లెయిన్‌ను సంఘటనా స్థలంలోనే విడిచిపెట్టారు.



పంగిడిగూడెం శివారులో పోలవరం కుడికాలువ గట్టుపై అక్రమంగా మట్టి తవ్వుతున్న దృశ్యం



సంఘటనా స్థలంలో జనసేన నాయకుడి కారు

ప్రజలు అన్నీ గమనిస్తున్నారు : మాజీ మంత్రి వనిత

అధికారం అండగా కూటమి నేతల దోపిడీలను ప్రజలు గమనిస్తున్నారని మాజీ మంత్రి తానేటి వనిత అన్నారు. పంగిడిగూడెంలో మట్టి అక్రమ తవ్వకాలను స్థానికులు అడ్డుకున్న సంఘటనపై ఆమె స్పందించారు. కూటమి నేతలు బహిరంగంగా మట్టి దందాను సాగిస్తుంటే అధికారులు కళ్లప్పగించి చూడటంపై మండిపడ్డారు. మట్టి తవ్వకాలను మధ్యాహ్నం అడ్డుకుంటే, సాయంత్రం వరకు పోలీసులు స్పందించకపోవడం దారుణమన్నారు. మిగిలిన శాఖల అధికారులు పూర్తిగా చేతులెత్తేశారని ఆరోపించారు. ఇలానే కొనసాగితే కూటమి సర్కారుపై ప్రజల తిరుగుబాటు తప్పదని ఆమె హెచ్చరించారు.

పశువధ నిరసనలు.. కూటమిలో కుంపట్లు!

- తేతలిలో పశువధ పరిశ్రమపై పెరుగుతున్న వ్యతిరేకత
- రోడ్డెక్కి నిలదీస్తున్న మహిళలు
- కూటమి నేతల్లో మంటలు రాజేస్తున్న వైనం
- జనసేన, బీజేపీ నేతల్లో అంతర్మథనం

తణుకు అర్బన్: ఒత్తిడి.. ఒత్తిడి అంటున్న అధికార యంత్రాంగం.. పశువధ కర్మాగార బాధితుల వ్యథను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం.. ఏం జరుగుతుందో తెలియని పరిస్థితుల్లో పశువధ కర్మాగారం లాహం ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిజాన్ని ఒప్పుకుంది. తేతలి గ్రామ పరిధిలో లాహం సంస్థ నిర్వహిస్తున్న పశువధ కర్మాగార రక్తపు మరకలు కూటమి ప్రభుత్వానికి అంటడంతో తేతలి గ్రామస్తులు, బాధితులు మండిపడుతున్నారు. ప్రభుత్వ తీరును దుమ్మెత్తి పోస్తున్నారు. ముఖ్యంగా కర్మాగారానికి రక్షణగా నిలుస్తున్న అధికార యంత్రాంగం తమకు పైనుంచి ఒత్తిడి ఉందంటున్న వ్యవహారం బట్టబయలైంది. తాజాగా ఆ సంస్థ జనరల్ మేనేజర్ అరవింద్ సరీన్ చేసిన వ్యాఖ్యలు మంటలు రేపుతున్నాయి. ప్రస్తుత ప్రభుత్వం వ్యాపారం పెంచాలని తమపై ఒత్తిడి చేస్తుందని ఆయన బాహాటంగా అనడంతో అసలు విషయం తేటతెల్లమైంది.



తేతలిలో నిరసన శిబిరం వద్ద నినాదాలు చేస్తున్న గోసేవా సమితి సభ్యులు, గ్రామస్తులు

కూటమిలో మల్లగుల్లాలు

తణుకు ఎమ్మెల్యే పశువధ కర్మాగారాన్ని మూయించే ప్రయత్నం చేయకపోవడంతో కూటమిలో ఉన్న బీజేపీ, జనసేన వర్గాలు తలలు పట్టుకుంటున్నాయి. ఈ కర్మాగారం నుంచి తమకు ఎటువంటి వనరులు అందకపోయినా తమపై మచ్చ పడుతుందనే ఆందోళన ఆయా పార్టీల కేడర్‌లో వ్యక్తమవుతోంది. దీనికితోడు రోజురోజుకూ పశువధశాలపై వ్యతిరేకత పెరగడం, నిరసనలు మిన్నంటగా అఖిలపక్షం కూడా కార్యాచరణ ప్రకటించడం కూటమి నాయకులకు మింగుడు పడటం లేదు. అలాగే బీజేపీ, జనసేన తీరును కూడా బాధితులు తప్పుపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో బీజేపీ, జనసేన నాయకులు ఏం నిర్ణయం తీసుకోవాలో తెలియక మల్లగుల్లాలు పడుతున్నారు.

మహిళల మండిపాటు

పశువధ శాల కారణంగా దుర్వాసనతో అల్లాడుతున్నామని, ఇళ్లల్లో ఉండలేకపోతున్నామంటూ రోడ్డెక్కి నిరసనలు తెలుపుతున్నా తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పట్టించుకోవడం లేదని బాధిత మహిళలు మండిపడుతున్నారు.

కర్మాగారాన్ని మూయాల్సిందే..



మన ఊరు, మన నేల, మన నీరు బావుండాలంటే తేతలిలో పశువధ శాల అనే కర్మాగారాన్ని పారదోలాల్సిందే. పచ్చని పంటలు పండే ఈ ప్రాంతంలో రక్తపాతం చిందిస్తున్న కర్మాగారాలు ఉండాల్సిన అవసరం లేదు. అలాంటి కర్మాగారాల్లో ఇక్కడి కార్మికులకు ఉపాధి కూడా అవసరం లేదు. ఈ ప్రాంతవాసులకు తమ ప్రాంతంలో ఇళ్లు నిర్మించుకుని ఉండే హక్కు లేదా. దుర్మార్గులకు సెల్యూట్ చేస్తూ స్థానికులైన అమాయకులను ఇబ్బందులు పెట్టే రోజులు పోవాలి.

– కొండ్రెడ్డి శ్రీనివాస్, గోసేవా సమితి సభ్యుడు

క్లుప్తంగా

అట్టహాసంగా శ్రీవారి గ్రామోత్సవం



ఉభయ దేవేరులు, గోదాదేవికి హారతులిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాలు అట్టహాసంగా జరుగుతున్నాయి. నిత్యం చినవెంకన్న ఉభయ దేవేరులు, గోదాదేవితో క్షేత్ర పురవీధుల్లో ఊరేగుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం జరిగిన స్వామివారి తిరువీధి సేవ భక్తులకు నేత్రపర్వమైంది. తొలుత ఆలయంలో శ్రీవారు, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవ మూర్తులను తొళక్క వాహనంపై ఉంచి, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా స్వామివారి వాహనం క్షేత్ర పురవీధులకు పయనమైంది. అర్చకులు, పండితుల వేద మంత్రోచ్చరణలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, గజ, అశ్వ సేవల నడుమ గ్రామోత్సవం కన్నులపండువగా జరిగింది. అనంతరం శ్రీవారు, అమ్మవార్లకు అర్చకులు ప్రత్యేక పూజలు జరిపి, భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

తెలంగాణ మద్యం పట్టివేత



ఎక్సైజ్ పోలీసుల అదుపులో మహిళ

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి మండలం పి.రాజవరంలో ఆదివారం ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 13 సుంకం చెల్లించని తెలంగాణ మద్యం సీసాలను ఒక మహిళ ఇంట్లో స్వాధీనం చేసుకున్నట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనుబాబు తెలిపారు. ఆ మహిళపై కేసు నమోదు చేశామని చెప్పారు. దాడుల్లో ఎస్సై జి. వెంకటలక్ష్మి, ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న దృశ్యం

ఆగిరిపల్లి: మండలంలోని తోటపల్లిలో ఆదివారం ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి తోటపల్లి శివారులో నాటుసారా తయారీకి నిల్వ ఉంచిన 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు ఈశ్వరరావు, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు

తాడేపల్లిగూడెం రూరల్: యువతి అదృశ్యంపై ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఏఎస్సై వీవీకే.దుర్గారావు తెలిపారు. మండలంలోని కుంచనపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి భార్యతో చర్చికి వెళ్లి తిరిగి రాగా కుమార్తె (20) కనిపించలేదు. ఆమె ఆచూకీ కోసం గ్రామ, పరిసర గ్రామాల్లో గాలించినా ఫలితం లేకపోవడంతో శనివారం సాయంత్రం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అడ్డాకులే ఆదాయం

- గిరిజన మహిళలతో విస్తర్ల తయారీ కేంద్రం ఏర్పాటు
- ఉపాధి పొందుతున్న 150 మంది మహిళలు

బుట్టాయగూడెం: పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో అడవులలోని అడ్డాకులు గిరిజన మహిళలకు ఉపాధి కల్పిస్తున్నాయి. పదేళ్ల క్రితం వరకూ గిరిజన ప్రాంతంలో సుమారు 50 టన్నుల వరకూ అడ్డాకులు సేకరించేవారు. గిరిజనులు సేకరించిన అడ్డాకులను గిరిజన సహకార సంస్థ(జీసీసీ) అధికారులు కొనుగోలు చేసేవారు. బయటప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు కూడా గిరిజనుల నుంచి కొనుగోలు చేసి విస్తరాకులుగా వినియోగించేవారు. వేసవికాలం వచ్చిందంటే అడవులకు వెళ్ళి అడ్డాకులు సేకరించడంలో గిరిజనులు నిమగ్నమవుతారు. అడ్డాకుతో విస్తర్లను తయారు చేసి శుభకార్యాల్లో భోజనాలకు వినియోగిస్తారు. ఇప్పుడు విస్తర్లు మాయమై పేపర్ ప్లేట్లు అందుబాటులోకి రావడంతో అడ్డాకుల విస్తర్ల వినియోగం తగ్గిపోవడంతో జీసీసీ అడ్డాకుల కొనుగోలును తగ్గించింది. వ్యాపారులు కూడా గిరిజన గ్రామాల్లోకి వచ్చి కొనుగోలు చేసే విధానం కూడా మానేయడంతో గిరిజనులు అడ్డాకుల సేకరణ తగ్గించారు. రానురానూ అడ్డాకుల విస్తర్లు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది.



అడ్డాకు సేకరిస్తున్న గిరిజనులు

అడ్డాకుల సేకరణను ప్రోత్సహిస్తున్న అధికారులు

ప్లాస్టిక్ ప్లేట్లు అందుబాటులోకి వచ్చినా వాటి వాడకం అనారోగ్యానికి దారితీస్తోంది. పర్యావరణానికి ముప్పుగా కూడా మారుతున్నాయి. ఈ సమస్యలకు పరిష్కారంగా పర్యావరణహితమైన విస్తర్ల వినియోగాన్ని పెంచే ప్రయత్నానికి కేఆర్‌పురం ఐటీడీఏ అధికారులు కృషి చేస్తున్నారు. దీనిలో భాగంగా అడ్డాకుల విస్తర్ల తయారీపై దృష్టి సారించారు. జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి పర్యవేక్షణలో ఏజెన్సీలోని మారుమూల గ్రామమైన నాగంపాలెంలో సౌభాగ్యదుర్గ మహిళా సంఘాల ఆధ్వర్యంలో వన్‌ధన్ వికాస్ కేంద్రం, ఐటీడీఏ ద్వారా సుమారు రూ.3 లక్షలతో అడ్డాకుల విస్తర్ల పరిశ్రమ ఏర్పాటు చేశారు. ఈ పరిశ్రమల ద్వారా 300 మందికి ఉపాధి కల్పించేలా ఏర్పాటు చేశారు. విస్తరు తయారీ యంత్రంతో పాటు రెండు కుట్టుమిషన్లను ఏర్పాటు చేయడంతో గిరిజన మహిళలు అడ్డాకుల విస్తర్ల తయారీలో నిమగ్నమయ్యారు.

ఆదాయం పొందుతున్న మహిళలు



మిషన్లతో విస్తర్లు కుడుతున్న దృశ్యం

కేఆర్‌పురం ఐటీడీఏ ద్వారా నాగంపాలెంలో ఏర్పాటు చేసిన వన్‌ధన్ వికాస్ కేంద్రంలో విస్తర్ల తయారీ ద్వారా గిరిజన మహిళలు ఆదాయం పొందుతున్నారు. దండిపూడి, చింతపల్లి, ఒర్రింక, గోగుమిల్లి, గడ్డపల్లి, తదితర ప్రాంతాల నుంచి అడ్డాకులను సేకరించి వాటిని మిషన్లపై విస్తర్లుగా కుడుతున్నారు. గిరిజన మహిళలు తయారు చేసిన ఒక్కొక్క విస్తరును రూ.9 చొప్పున విక్రయిస్తున్నారు. తమకు మిషన్‌లు ఐటీడీఏ ఇవ్వడం వల్ల అడ్డాకులకు మాత్రమే పెట్టుబడి పెడుతున్నామని రూ.9కు విక్రయించడంతో తమకు లాభం వస్తుందని మహిళలు చెబుతున్నారు. మార్కెటింగ్ సదుపాయం కూడా అధికారులే చూసుకుంటున్నారని రాబోయే రోజుల్లో అడ్డాకుల విస్తర్లు అధికంగా తయారు చేసి విక్రయిస్తామని గిరిజన మహిళలు చెబుతున్నారు. రోజుకు 200 విస్తర్లు కుడుతున్నామని నెలకు సుమారు రూ.54 వేల వరకూ ఆదాయం పొందుతున్నామని మహిళలు చెబుతున్నారు.

అధికారుల సహకారం బాగుంది



గతంలో నేను అడవిలో అడ్డాకులు సేకరించి ఇంటి దగ్గరే విస్తర్లు తయారు చేసి విక్రయించాను. ఒక్కో విస్తరు రూ.1.50 పైసలకు అమ్మేదాన్ని. ప్రస్తుతం అధికారులు నేను తయారు చేసిన విస్తర్లను కూడా కొనుగోలు చేస్తున్నారు. రోజుకు రూ.150 వరకూ ఇంటి దగ్గరే ఆదాయం వస్తుంది.

మిర్చివాడ బంగారమ్మ,
డ్వాక్రా మహిళ, చింతలగూడెం, బుట్టాయగూడెం మండలం

విస్తర్ల వినియోగం పెంచే ప్రయత్నం



గతంలో ఏజెన్సీ ప్రాంతంలో అడ్డాకుల విస్తర్లతోనే శుభకార్యాల్లో పెళ్లిళ్లలో భోజనాలు చేసేవారు. ప్లాస్టిక్ ప్లేట్లు అందుబాటులోకి వచ్చినా వాటి వల్ల అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో పర్యావరణ హితమైన విస్తర్లను వినియోగించేలా ఐటీడీఏ అధికారులు ప్రోత్సహించారు.

మిర్చివాడ రామలక్ష్మి,
వెలుగు వీఓఏ- చింతలగూడెం, బుట్టాయగూడెం మండలం

పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నాం



వన్‌ధన్ వికాస్ కేంద్రం ద్వారా ఏర్పాటు చేసిన విస్తర్ల తయారీ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నాం. అడ్డాకుల విస్తర్ల మిషన్‌లు ఏర్పాటు చేయడం వల్ల మళ్లీ అడ్డాకుల సేకరణపై దృష్టి సారించాం. ఆకుల సేకరణ, విస్తర్ల తయారీ వల్ల ఉపాధి పెరిగి ఆర్థిక పరిస్థితి మెరుగుపడే అవకాశం ఉంది.

మిర్చివాడ కనకరత్నం,
డ్వాక్రా మహిళ, చింతలగూడెం, బుట్టాయగూడెం మండలం

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాట్నాలమ్మ

పెదవేగి: పెదవేగి మండలం రాట్నాలకుంటలో వేంచేసిన రాట్నాలమ్మను ఆదివారం భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవారికి పూజా టిక్కెట్లపై రూ.18,400, విరాళంపై రూ.6,326, లడ్డూ ప్రసాదంపై రూ.13,665, ఫొటోల అమ్మకంపై రూ 1,215 ఆదాయం లభించిందని ఈవో ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు.

వాలీబాల్ టీంకు జిన్నూరు కుర్రోడు



గుబ్బల శ్రీనివాస్

పోడూరు: జిన్నూరు గ్రామానికి చెందిన గుబ్బల శ్రీనివాస్ నేషనల్ వాలీబాల్ టీంకు ఎంపికయ్యాడు. విజయవాడలో ఇటీవల జరిగిన నేషనల్ వాలీబాల్(సీనియర్స్) సెలక్షన్‌లో ప్రతిభ కనబర్చిన టీంకు ఎంపికయ్యాడు. వాలీబాల్‌లో చిన్ననాటి నుంచే అద్భుతమైన చూపుతున్న శ్రీనివాస్ ఇప్పటికే జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషించాడు. ఈ నెల 18 నుంచి 22 వరకు జరిగిన సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ టోర్నమెంట్‌లో నన్నయ యూనివర్సిటీ జట్టు తరఫున ఆడాడు. నేషనల్ టీంకు ఎంపిక కావడం పట్ల గ్రామ సర్పంచ్ జమ్ము బేబీ మహలక్ష్మి, గ్రామ నాయకులు అభినందనలు తెలిపారు.

14 నుంచి కబడ్డీ పోటీలు

వివిధ రాష్ట్రాల నుంచి 30 జట్ల హాజరు



వివరాలు వెల్లడిస్తోన్న కబడ్డీ అసోసియేషన్ సీఈవో వీర్లెంకయ్య, గోగులమ్మ ఉత్సవ కమిటీ సభ్యులు

నరసాపురం: నరసాపురం రుస్తుంబాధలో గోగులమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏటా జరిగే పురుషుల, మహిళల జాతీయస్థాయి కబడ్డీ పోటీలు వచ్చే నెల 14 నుంచి 18 వరకూ నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు చెప్పారు. 32వ జాతీయస్థాయి కబడ్డీ పోటీలు మరింత ఘనంగా నిర్వహిస్తున్నామని.. ఈ ఏడాది మరో రూ.2.50 లక్షలు ప్రైజ్‌మనీ పెంచినట్టు పేర్కొన్నారు. గోగులమ్మ ఆలయం వద్ద ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పోటీల కన్వీనర్ కొత్తపల్లి జానకీరామ్, ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ సీఈవో వి.వీర్లెంకయ్య, కార్యదర్శి పి.పద్మజాబాల వివరాలు తెలిపారు. పురుషుల విభాగం నుంచి 15, మహిళల విభాగం నుంచి 15 జట్లకు ఆహ్వానం పంపామని చెప్పారు. హర్యానా, యూపీ, చండీగఢ్, రాజస్థాన్, బీహార్, కర్ణాటక, మహారాష్ట్ర, వెస్ట్ బెంగాల్, ఆంధ్రా, తెలంగాణ నుంచి జట్లు వస్తున్నాయని చెప్పారు. దేశంలో ఎక్కడాలేని విధంగా నరసాపురంలోనే ఒక్క ఏడాది కూడా బ్రేక్ లేకుండా 31 ఏళ్లగా జాతీయస్థాయిలో టోర్నమెట్ జరుగుతుందని చెప్పారు. లీగ్ కం నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయని చెప్పారు. ఈ ఏడాది మొత్తం రూ 7.50 లక్షల ప్రైజ్‌మనీ ఇస్తున్నట్టు చెప్పారు. మొదటి బహుమతిగా రూ.1.50 లక్షలు, రెండో బహుమతిగా రూ.లక్ష, మూడో బహుమతిగా రూ.75 వేలు, నాలుగో బహుమతిగా ర. 50 వేలు పురుషుల, మహిళల విభాగాల్లో అందిస్తామన్నారు.

జిల్లా క్రాస్ కంట్రీ జట్ల ఎంపిక



గెలుపొందిన క్రీడాకారులతో వ్యాయామ ఉపాధ్యాయులు

తణుకు అర్బన్: పశ్చిమగోదావరి జిల్లా క్రాస్ కంట్రీ (రోడ్ రన్) జట్ల ఎంపికలు తణుకు పట్టణంలోని డీ-మార్ట్ ప్రాంతంలో ఆదివారం నిర్వహించినట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సంకు సూర్యనారాయణ తెలిపారు. బాలురు, బాలికల జట్లకు నిర్వహించిన ఈ రోడ్ రన్‌లో ఎంపికైన క్రీడాకారులు జనవరి నెలలో తణుకు మండలం వేల్పూరులో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఈ పోటీల్లో పాల్గొన్న సుమారు రెండు వందల మంది క్రీడాకారులకు తణుకుకు చెందిన కొమ్మిశెట్టి జయకృష్ణ, పత్తుల ఆశిష్ విక్టర్ సర్టిఫికెట్లు, ట్రోఫీలు అందజేశారు. బాలుర పోటీలను మానేపల్లి శ్రీనివాస్, బాలికల పోటీలను బసవ రామకృష్ణ ప్రారంభించారు. అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్. సత్యనారాయణ, కోశాధికారి కె.బాబురావు, వ్యాయామ ఉపాధ్యాయులు కె.సీతారామయ్య, బి.స్వామి, ఏ.నాగేశ్వరావు, కె.వెంకన్నబాబు, జి.రవి, కె.సంధ్య, బి.శేఖర్, వై.శ్రీకాంత్ పర్యవేక్షించారు.

స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయండి మహాప్రభో!

దెందులూరు: రాష్ట్రంలో ఏకైక ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల గోపన్నపాలెంలో స్కాలర్‌షిప్ సమస్య విద్యార్థులను బాధిస్తోంది. ఈ కళాశాలలో యూజీడీ, బీపీఈడీ రెండు కోర్సుల్లో వ్యాయామ విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ప్రభుత్వం వీరికి స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాల్సి ఉంది. ఒకవైపు కళాశాలలో పూర్తిస్థాయిలో హాస్టల్ లేదు. మరోవైపు స్కాలర్‌షిప్ కూడా పెండింగ్ ఉందని.. తమ పరిస్థితి అర్థం చేసుకోవాలని విద్యార్థులు వాపోతున్నారు. ఈ కళాశాలలో గవర్నమెంట్ హాస్టల్ కూడా లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో అనేక ప్రాంతాల నుంచి యూనివర్సిటీ నిర్వహించిన పీసెట్ ఎగ్జామినేషన్ ద్వారా ఎంపికై వ్యాయామ విద్యను అభ్యసిస్తున్నామని, త్వరితగతిన స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయాలని వ్యాయామ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు కోరుతున్నారు. రాష్ట్రంలోనే గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలకు మంచి పేరు ఉన్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. కానీ వసతులు లేక ఈ కళాశాల గుర్తింపును ఒకసారి యూనివర్సిటీ రద్దు చేసిన సంగతి విదితమే. కళాశాలలోని విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పెండింగ్ ఉన్న విషయం వాస్తవమేనని గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల సూపరింటెండెంట్ ధ్రువీకరించారు.

నేటి నుంచి కానిస్టేబుల్ ఎంపికలు

- ఏలూరు పరేడ్ గ్రౌండ్స్‌లో పోటీ పరీక్షలు
- ఉమ్మడి పశ్చిమ నుంచి 4976 మంది హాజరు

ఏలూరు టౌన్: కానిస్టేబుల్ నియామక ప్రక్రియలో భాగంగా తుది ఎంపికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. రెండేళ్లి క్రితం కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి ప్రాథమిక రాత పరీక్షలు పూర్తిచేయగా.. తుది ఎంపికల్లో భాగంగా దేహదారుఢ్య పరీక్షలకు సర్వం సిద్ధం చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 4,976 మంది అభ్యర్థులు వివిధ అంశాల్లో పోటీపరీక్షలకు హాజరుకానున్నారు. ఈ మేరకు ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ అధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు, అవకతవకలు లేకుండా ఎంపికలు జరిగేలా పటిష్టమైన చర్యలు చేపట్టామని చెప్పారు. ఈ ఎంపిక పరీక్షలకు 979 మంది మహిళా అభ్యర్థులు, 3,997 మంది పురుష అభ్యర్థులకు హాల్‌టికెట్లు జారీ చేశామని తెలిపారు. ఈ నెల 30 నుంచి జనవరి 9 వరకూ ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో కానిస్టేబుల్ నియామక తుది పరీక్షలు నిర్వహిస్తామని ఎస్పీ శివకిషోర్ స్పష్టం చేశారు. మహిళా అభ్యర్థులకు ప్రత్యేకంగా జనవరి 3, 4 తేదీల్లో దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు చేపట్టామని చెప్పారు. అభ్యర్థులు నిర్దేశిత సమయానికి ముందే గ్రౌండ్‌లో ఉండాలని, ఆలస్యంగా వస్తే అనుమతి ఉండదని ఎస్పీ చెప్పారు. అభ్యర్థి ఒక్కరినే గ్రౌండ్‌లోకి అనుమతిస్తామని, స్నేహితులు, బంధువులకు అనుమతి ఉండదని చెప్పారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు పూర్తి పారదర్శకంగా చేపడతామని తెలిపారు. వైద్య శిబిరం, అంబులెన్స్‌లు సైతం ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా దళారులు ఉద్యోగాలు ఇప్పిస్తామని చెబితే నమ్మవద్దని, ప్రచారం చేస్తే తమకు నేరుగా సమాచారం ఇవ్వాలని ఎస్పీ స్పష్టం చేశారు.



సమీక్షిస్తున్న ఎస్పీ శివకిషోర్

కోడి పందేల నిర్వాహకుల అరెస్టు

భీమడోలు: గుండుగొలనులో కోడి పందేల స్థావరంపై ఆదివారం రాత్రి భీమడోలు పోలీసులు ఆకస్మిక దాడులు చేశారు. గ్రామంలోని కుండీలపేట ఏరియాలో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో ఎస్సై వై.సుధాకర్ నేతృత్వంలో పోలీసులు దాడులు చేపట్టారు. ఈ దాడిలో 9 మంది జూదరులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.3,500 నగదు, 7 మోటార్ బైక్‌లు, కోడి పుంజు, రెండు కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

వైఎస్సార్‌సీపీ కన్వీనర్‌పై కక్ష సాధింపు



గంగవరంలో గ్రామ కన్వీనర్ ఇంటి ముందు పోసిన పునాది రద్దు మట్టి

కొయ్యలగూడెం: వైఎస్సార్‌సీపీ శ్రేణులపై కక్ష సాధింపు చర్యలు కొనసాగుతున్నాయి. రాజవరం పంచాయతీ గంగవరం గ్రామానికి చెందిన గ్రామ కన్వీనర్ కంచర్ల సత్యనారాయణ ఇంటి ముందు అదే గ్రామానికి చెందిన వ్యక్తులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారు. ఆదివారం తొలగించిన పాత ఇంటి పునాది రద్దు మట్టిని ట్రాక్టర్ ట్రక్కులతో తీసుకువచ్చి ఇంటి ముందు అడ్డంగా పోశారు. రాకపోకలకు వీలు లేకుండా, మురుగునీటి పారుదలకు అడ్డుగా డ్రెయిన్ పూడ్చివేశారు. దీనిపై పంచాయతీకి ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని సత్యనారాయణ వాపోయారు.

వైభవంగా ఆలయ ప్రతిష్ఠ



దత్తాశ్రమంలో శ్రీ అనంతేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ యాగంలో గణపతి సచ్చిదానందస్వామీ

నూజివీడు: పట్టణంలోని దత్తాశ్రమంలో నూతనంగా నిర్మించిన శ్రీ అనంతేశ్వర ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. దీనిలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన అవధూత దత్తపీఠాధిపతి జగద్గురు, పరమపూజ్య శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉదయం 8 గంటలకు దత్తాత్రేయ స్వామికి తైలాభిషేకం నిర్వహించారు.


మొక్కజొన్న రైతుల ఆశలకు 'కత్తెర'



కొత్తరావిచర్లలో కత్తెర పురుగు ఆశించిన మొక్కజొన్న పంట



కత్తెర పురుగు ఆశించి తినేసిన మొక్కజొన్న ఆకులు



నూజివీడు: రబీ సీజన్‌లో సాగుచేసిన మొక్కజొన్న పంటను కత్తెర పురుగు (ఫాల్ ఆర్మీ వార్మ్) ఆశించడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఈ పురుగు ఉధృతితో దిగుబడులు గణనీయంగా తగ్గి నష్టాలు వస్తాయోమోనని ఆందోళన వ్యక్తమవుతోంది. దీనిని ప్రారంభంలోనే నియంత్రించకపోతే ఇబ్బందులు తప్పవని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

రబీ సీజన్‌లో నియోజకవర్గంలోని రైతులు మొక్కజొన్న పంటను ఎక్కువగా సాగుచేశారు. కమర్షియల్, విత్తన మొక్కజొన్న రకాలు సాగు చేశారు. ప్రస్తుతం మొక్కజొన్న 20 నుంచి 35 రోజుల దశలో ఉంది. ఇంతవరకు దాదాపు 13,300 ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేయగా కొన్ని మండలాల్లో 10 నుంచి 20 శాతం వరకు పంటకు కత్తెర పురుగు ఆశించింది. పంటకు ఆశించి ఆకులు తినేస్తుండటంతో రైతులు బెంబేలెత్తుతున్నారు. ఎకరాకు రూ.15 వేలు కౌలు చెల్లించి మొక్కజొన్న సాగుచేసిన రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. ఎకరాకు ఇంతవరకు రూ.30 వేల నుంచి రూ.40 వేల పెట్టుబడి పెట్టామని రైతులు వాపోతున్నారు.

ఈ పురుగు మొక్కజొన్న పంట పది రోజుల దశకు వచ్చిన దగ్గర నుంచి ఆశిస్తుంది. మొదట మొక్క ఆకులకు వ్యాపించి ఆ తరువాత సుడిలో చేరి మొక్క ఆకులను కొరికి తినేస్తుంది. దీనివల్ల మొక్కలన్నీ బలహీనంగా తయారై దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

జిల్లాలో మొక్కజొన్న పంటను రబీలో ఎక్కువగా నూజివీడు నియోజకవర్గంలోనే సాగుచేస్తున్నారు. ముఖ్యంగా చాట్రాయి మండలంలో 8,700 ఎకరాల్లో సాగు చేశారు. నూజివీడు మండలంలో 1,400 ఎకరాలు, ఆగిరిపల్లి మండలంలో 500 ఎకరాలు, ముసునూరు మండలంలో 2,700 ఎకరాల వరకు రైతులు సాగుచేశారు. మొక్కజొన్నకు మార్కెట్‌లో ధర బాగానే ఉండటంతో రైతులు ఈ పంట సాగుకు మొగ్గు చూపుతున్నారు. దీనికి తోడు విత్తన మొక్కజొన్నను సైతం రైతులు సాగుచేస్తున్నారు. ఈ పంటకు కత్తెర పురుగు ఆశించడంతో వారు పెట్టుకున్న ఆశలు అడియాశలయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ మాయదారి పురుగు వల్ల తాము పెట్టిన పెట్టుబడి నేలపాలేనని రైతులు లబోదిబోమంటున్నారు.


వేప కషాయం మేలు



కత్తెర పురుగు ఉనికి మండలంలోని పలు గ్రామాల్లో రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటలో కనిపిస్తోంది. కత్తెర పురుగు గమనించిన వెంటనే రైతులు వేప కషాయంతో పాటు ఇమామెక్టిన్ బెన్‌జోయెట్ 1 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవడం ద్వారా నివారించుకోవచ్చు.

ఏ చాముండేశ్వరి, వ్యవసాయాధికారి, నూజివీడు

నూతన సంవత్సర కోలాహలం



వస్త్ర దుకాణాల్లో అమ్మకానికి సిద్ధం చేసిన చిన్నారుల వస్త్రాలు



తాడేపల్లిగూడెం ప్రాంతంలో రంగు రంగుల ముగ్గుల దుకాణం

- చర్చిలు, గృహాల వద్ద విద్యుత్ కాంతులు
- జోరుగా సామాగ్రి విక్రయాలు

పెంటపాడు: నూతన సంవత్సర కోలాహలం మొదలైంది. ఈ నెల 31న, వచ్చే సంవత్సరం జనవరి ఒకటిన ప్రజలకు పర్వదినాలు. పాత సంవత్సరానికి వీడ్కోలు పలికి, నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పలువురు ఉత్సాహం చూపుతారు. ముగ్గులు వేసేందుకు రంగులు కొనుగోలు చేస్తున్నారు. దీని కోసం పలు దుకాణాలు వెలిశాయి. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెం, తణుకు ప్రాంతాల్లో పలు దుకాణాల వద్ద సందడి నెలకొంది. నూతనత్వాన్ని సంతరించుకొని ఉత్సాహ వాతావరణం ఏర్పాటైంది. నూతన సంవత్సర వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించుకునేందుకు అన్ని వర్గాల ప్రజలు సన్నద్ధం అవుతున్నారు. పలు ఇళ్లు, షాపులు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. నూతన సంవత్సరంలోనే పలు గ్రామ దేవతల ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద నిర్వాహకులు జాతర్లు, సేవలు చేసేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. దీంతో పాటు, నూతన సంవత్సరంలో వస్త్ర దుకాణాలు ఆఫర్లు ప్రకటిస్తున్నాయి. తాడేపల్లిగూడెం, తణుకు ప్రాంతాల్లో ఇటీవల పలు షాపింగ్ మాల్స్ వెలిశాయి. వస్త్ర దుకాణాలు పోటీ పడి మరీ ఆఫర్లు ప్రకటిస్తున్నాయి. పల్లెల నుంచి వస్త్రాలు కొనుగోలు చేసేందుకు వస్తున్నారు.

జోరుగా సామాగ్రి అమ్మకాలు

జనవరి వచ్చిందంటే పట్టణంలో పలు దుకాణాల వద్ద విద్యుత్ లైటింగ్ దండలు, పూల దుకాణాల వద్ద స్టోర్స్‌లలో రూ.50 నుంచి రూ.3 వేల వరకు బొకేలు, విద్యుత్ లైటింగ్‌దండలు అందుబాటులో ఉంటాయి.

క్లుప్తంగా

మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళి



మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రామకృష్ణ

తణుకు అర్బన్: మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతికి తణుకు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. ఆదివారం తణుకులో నిర్వహించిన కార్యక్రమంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తణుకు నియోజకవర్గ ఇన్‌చార్జి దిర్సిపో రామకృష్ణ మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ మృతి కాంగ్రెస్‌కు తీరని లోటని, ఆర్థిక మంత్రిగా, ప్రధాన మంత్రిగా ఆయన సేవలు చిరస్మరణీయమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో చుక్కాకుల వరలక్ష్మి, అన్నెపు శ్రీను, దిర్సిపో శాంతారావు, గెడ్డం ప్రసాద్, సిర్రా పోలయ్య, కంకిపాటి తేజ, తదితరులు పాల్గొన్నారు.

డీసీవై ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న సురేష్

తణుకు అర్బన్: డిస్ట్రిక్ట్ క్రిస్టియన్ యూత్ (డీసీవై) 22వ వార్షికోత్సవ క్రిస్మస్ వేడుకలు ఆదివారం తణుకు పాతూరు కొండాలమ్మ పుంత రోడ్డులోని డంపింగ్‌యార్డు ప్రాంతంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన న్యాయవాది పొట్ల సురేష్ చేతుల మీదుగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో గణేష్, బుర్ర సతీష్, కరటూరి జగదీష్, పడాల లక్ష్మణ్, తిర్రే ప్రణదీప్, డీసీవై సభ్యులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే ఎస్సీ వర్గీకరణ



ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజాన్ మిశ్రాకు వినతి పత్రం అందజేస్తున్న బట్టు నాగరాజు

అత్తిలి: రాజకీయ స్వ ప్రయోజనాల కోసం దళిత వర్గాన్ని చీల్చి దళితులను అస్థిర పరిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ ముసుగులో ప్రయత్నిస్తున్నాయని ఆల్ ఇండియా దళిత రైట్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి బట్టు నాగరాజు పేర్కొన్నారు. వర్గీకరణ జనాభా ప్రాతిపదికన చేసి రిజర్వేషన్ శాతం పెంచాలని, క్రిమిలేయర్ అన్ని సామాజిక వర్గాలకు వర్తింప చేయాలన్నారు. మత ప్రస్తావన లేకుండా రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. ఈ మేరకు ఆదివారం ఏలూరులో జరిగిన ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజాన్‌మిశ్రాకు వినతి పత్రాన్ని అందజేశామని నాగరాజు తెలిపారు.

కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు



కాలువలో పడిన చెట్టు వద్ద పేరుకుపోయిన చెత్త, జంతు కళేబరాలు

అత్తిలి: పంట కాలువలో పడిన చెట్టుతో చెత్త, వ్యర్థ పదార్థాలు నిలిచిపోవడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతుంది. అత్తిలి నుంచి గుమ్మంపాడు లాకులకు వెళ్లే మార్గంలో కాలువగట్టుపై ఉన్న చెట్టు వేళ్లతో సహా కుంగి కాలువలో పడింది. దీంతో కాలువ ఎగువ ప్రాంతం నుంచి కొట్టుకొస్తున్న చెత్త, వ్యర్థ పదార్థాలు, జంతు కళేబరాలు కాలువలో పడి ఉన్న చెట్టు వద్ద నిలిచిపోతున్నాయి. రోజుల తరబడి చెత్త, జంతు కళేబరాలు పేరుకుపోవడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని స్థానిక రైతులు వాపోతున్నారు. ఈ కాలువ నీటినే మండల ప్రజలు తాగునీటి అవసరాలకు వాడుతుంటారు. మురుగు డ్రెయిన్‌ను తలపించేలా ఉన్న అత్తిలి కాలువలో పేరుకుపోయిన చెత్తను, కాలువలో పడి ఉన్న చెట్టును సంబంధిత శాఖ అధికారులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లా క్రికెట్ జట్టు కెప్టెన్‌గా నంబూరి కార్తీక్‌వర్మ

పాలకోడేరు: మండలంలోని పాలకోడేరు గ్రామానికి చెందిన నంబూరి కార్తీక్‌వర్మ పశ్చిమ గోదావరి జిల్లా అండర్-12 క్రికెట్ జట్టు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. భీమవరం ఏసీఏ క్యాంప్ కోచ్ నుంచి ఎంపిక కావడంపై డీఎస్ఆర్ ఏసీఏ క్యాంప్ కోచ్ టి.శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. తమ గ్రామానికి చెందిన కార్తీక్ వర్మ ఎంతో ప్రాచుర్యం కలిగిన క్రికెట్ ఆటకు చిన్న వయసులోనే జిల్లా జట్టుకు కెప్టెన్‌గా ఎంపిక కావడంతో గ్రామస్తులు, క్షత్రియ సేవా సమితి సభ్యులు, గ్రామ పెద్దలు, పలువురు క్రీడాకారులు అభినందించారు.

పింఛన్ సొమ్ము కోసం వేధిస్తున్న వ్యక్తిపై కేసు

తాడేపల్లిగూడెం రూరల్: వృద్ధురాలిని కొట్టి గాయపర్చిన నేరంపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్సై జేవీఎన్.ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బంగారుగూడెం గ్రామానికి చెందిన అక్కల సుభద్రను అదే గ్రామానికి చెందిన గొలిమే ఏడుకొండలు అలియాస్ పండు పింఛన్ సొమ్ము కోసం వేధిస్తున్నాడు. అయితే ఈ నెల 24న ఉదయం పది గంటల సమయంలో ఏడుకొండలు ఆమె ఇంట్లోకి ప్రవేశించి పింఛన్ సొమ్ములు ఇమ్మని అడుగగా లేవని చెప్పడంతో సుభద్రను కర్రతో కొట్టి గాయపరిచాడు. దీంతో బాధితురాలి సుభద్ర పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కోత బంతాట కేసులో ఐదుగురి అరెస్టు

తాడేపల్లిగూడెం రూరల్: కోత బంతాట కేసులో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్సై జేవీఎన్ ప్రసాద్ తెలిపారు. ఆదివారం రాత్రి ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కొండ్రుప్రోలు గ్రామ శివారులో కోతబంతాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2120, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై ప్రసాద్ తెలిపారు.

ప్రజల శ్రేయస్సే 'మానవత' లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న మానవత సంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి

తణుకు అర్బన్: సమాజంలో మానవత్వాన్ని పరిమళింపచేయాలనే లక్ష్యంతోనే మానవత సంస్థ పని చేస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకుడు ఎస్.రామచంద్రారెడ్డి అన్నారు. తణుకు రోటరీ క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన పశ్చిమగోదావరి జిల్లా ప్రాంతీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలోని మానవత శాఖలు ఆశయాలకు అనుగుణంగా సమర్థవంతంగా సేవా పథంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ శాఖలకు దిశా నిర్దేశం చేస్తున్నాయని ప్రశంసించారు. కార్యక్రమంలో మానవత జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు, జిల్లా అధ్యక్షుడు దేవినేని భాస్కరరావు, సెంట్రల్‌కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, తణుకు శాఖ అధ్యక్షులు కటారి శారదాదేవి, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన మానవత సభ్యులు పాల్గొన్నారు.

మానవతా శాంతిరథం సేవలు ప్రారంభం

అత్తిలి: మానవతా అనే కుటుంబంలో ప్రతి ఒక్కరూ సభ్యులుగా చేరడం ద్వారా ప్రతి సమస్యను ధైర్యంతో ఎదుర్కోవచ్చని సంస్థ వ్యవస్థాపకుడు నిమ్మనపల్లి రామచంద్రారెడ్డి అన్నారు. అత్తిలి మానవతా సంస్థ ఏర్పాటు చేసిన శాంతిరథాన్ని ఆదివారం అత్తిలిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రామచంద్రారెడ్డి మాట్లాడుతూ అత్తిలిలో మానవతా సంస్థ ఏర్పాటు చేసి మూడేళ్ల కాలంలో అంబులెన్స్, శాంతిరథాన్ని సమకూర్చుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మానవతా సంస్థ చైర్మన్ ఆనాల ఆదినారాయణ, జిల్లా అధ్యక్షుడు దేవినేని భాస్కరరావు, చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, కెరీర్‌గైడెన్స్ చైర్ పర్సన్ కోడూరి రాధా పుష్పావతి, కటారి శారదాదేవి, రాష్ట్ర అధ్యక్షుడు ఎం.కోటేశ్వరరావు, కొరిపల్లి హరి, కుక్కల వెంకట రామారావు, బోడపాటి సూర్యచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌పీడబ్ల్యూడీ యాక్ట్‌ను అమలు చేయాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు అప్పారావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆర్‌పీడబ్ల్యూడీ యాక్ట్-2016ను ప్రభుత్వం అమలు చేస్తే దివ్యాంగులకు విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పించొచ్చని సక్షమ్ జిల్లా అధ్యక్షుడు కేఎస్‌కేఎస్ అప్పారావు, కార్యదర్శి మధుసూధనరావు, కోశాధికారి దుర్గారావు పేర్కొన్నారు. పట్టణంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం వారి భవనంలో ఆదివారం సక్షమ్ జిల్లా సంఘం వారిచే ఆర్‌పీడబ్ల్యూడీయాక్ట్-2016పై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి దివ్యాంగులు హాజరయ్యారు. సహకార్యదర్శి కె.వి జయలక్ష్మి, సక్షమ్ రాష్ట్ర సంఘటనా మంత్రి కృష్ణమోహన్, వీర్రాజు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

తణుకు అర్బన్: ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం సోమవారం ఉదయం తొమ్మిది నుంచి పది గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తణుకు డిపో మేనేజరు సప్పా గిరిధర్ కుమార్ తెలిపారు. ఆర్టీసీ బస్సులపై ప్రయాణికులు, వ్యాపారులు, విద్యార్థులు తమ ఫిర్యాదులు, సూచనలు, సలహాలు ఫోన్ నంబర్ 99592 25484లో తెలియచేయాలని కోరారు.

మామిడి చెట్టుకు ప్రత్యేక పూజలు

కాళ్ల: ప్రకృతిలో ఎన్నో వింతలు విశేషాలు చోటు చేసుకుంటాయి. అటువంటి వింత సంఘటనే కాళ్ల మండలం బొండాడలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మండపాటి వెంకటేశ్వరరావు కుమారుడు రామలింగేశ్వరరావు ఇంటి పెరట్లో ఉన్న మామిడిచెట్టుకు లక్ష్మి నరసింహస్వామి రూపం దర్శనమిచ్చింది. ఇంటి యజమాని తొలుత యాధృచ్చికంగా వచ్చిందేమోనని పట్టించుకోకుండా వదిలేశారు. రోజురోజుకూ ఆకారం మరింత స్పష్టంగా కనిపించడంతో కుటుంబ సభ్యులు పూజలు చేయడం మొదలుపెట్టారు. ఆ చెట్టుకు చక్కగా రంగులు దిద్దడంతో ఆధ్యాత్మిక శోభ రూపుదిద్దుకుంది.

పద్మశాలీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ



పద్మశాలీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: జిల్లా పద్మశాలీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన సంవత్సర 2025 డైరీ, క్యాలెండర్‌ను సంఘ నాయకుడు డాక్టర్ వింజమూరు శ్రీనివాసరావు ఆదివారం ఆవిష్కరించారు. అసోసియేషన్ తరఫున సేవా కార్యక్రమాలు చేపట్టనున్నామని తెలిపారు. సంఘ నాయకులు అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కట్టా లక్ష్మణస్వామి, డి.కుమారస్వామి, కానూరు అగ్నివేష్, జై.మధుసూదన్‌రావు, సప్ప మణికంఠ అశోక్, చేసేటి మల్లేశ్వరరావు, ఆకురాతి పుష్పావతి, జి.నారాయణరావు, ఆకురాతి కృష్ణమోహన్, చింతలపూడి సుబ్బారావు, బి.వెంకట కృష్ణారావు, కె.బాలాజీ, టి.కల్కిమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్ల జాతర మహోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

భీమవరం: గునుపూడి గ్రామ దేవత శ్రీఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవాల బ్రోచర్లను శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ప్రతి ఒక్కరూ భక్తి భావంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల, ఎంపీపీ పేరిచర్ల నర్సింహరాజు, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల, వీరవాసరం మండలాధ్యక్షులు గాదిరాజు రామరాజు, జల్లా కొండయ్య, చవ్వాలకు సత్యనారాయణ, నాయకులు చినమిల్లి వెంకటరాయుడు, ఏఎస్ రాజు, కామన నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడకు తరలి రావాలి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పాలకోడేరు: విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్, జైభజరంగ్ దళ్ ఆధ్వర్యంలో జనవరి ఐదో తేదీన విజయవాడలో నిర్వహించే హైందవ శంఖారావం బహిరంగ సభకు తరలి రావాలని ఆ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. దీనికి సంబంధించి ఆదివారం ఉండి నియోజకవర్గం పాలకోడేరు మండలం పలు గ్రామాల్లో విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్, జైభజరంగ్ దళ్ కార్యకర్తలు గ్రామ గ్రామాన తిరిగి కరపత్రాల పంపిణీ చేశారు. హిందూ సోదర సోదరీమణులు ఈ భారీ బహిరంగ సభకు తరలిరావాలని మన దీక్ష దేవాలయాల రక్షకు అని, మన దేవాలయాలను రక్షించుకునేందుకు లక్షలాదిగా హైందవ సోదరులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అంబరాన్నంటిన క్రిస్మస్ సంబరాలు



క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, దైవజనులు



గూడెం సెంటినరీ చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో కీర్తనలు ఆలపిస్తున్న యువతులు



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న విశ్వాసులు

పెంటపాడు: తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో పలు క్రైస్తవ మందిరాల్లో ఆదివారం ఆరాధనలతో పాటు సాయంత్రం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెంటపాడు మండలం బి.కొండేపాడు గ్రామంలో సియోను ప్రార్థనా మందిరంలో సంఘ కాపరులు ఎం.సాల్మన్‌రాజు, కెజియా ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తణుకుకు చెందిన ఈపీఎఫ్ అధ్యక్షుడు పి.మోజెస్‌ప్రవీణ్ దేవుడి వాక్యం అందించారు. క్రీస్తు స్వరూపం ధరించుకొని విశ్వాసులు ఆధ్యాత్మికంగా ఎదగాలన్నారు. ఈ సందర్భంగా చర్చి సంఘ సభ్యులు గీతాలు ఆలపించారు. ప్రత్యేక నాటికలు వేశారు. వైఎస్సార్‌సీపీ మాజీ ఎంపీటీసీ పాలా గణపతి, మాజీ సర్పంచ్ తానికొండ సుదర్శనం, గ్రామ ప్రముఖుడు కొండ, సాంబయ్య, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మద్రే కృష్ణమూర్తి, వద్రే శివరామకృష్ణ, సొసైటీ మాజీ సభ్యుడు దేవరశెట్టి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా ఇంటింటికీ వైద్య సేవలు



వృద్ధులకు వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు

తణుకు అర్బన్: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికీ వైద్య సేవలు నిర్వహించారు. ఈ వైద్యసేవల్లో ప్రముఖ నేత్ర వైద్యుడు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, ఆర్థోపెడిక్ వైద్యుడు నిమ్మగడ్డ అచ్యుతరామయ్య ప్రత్యేక వాహనం ద్వారా ఇంటింటికీ వెళ్లి వృద్ధులు, మంచానికే పరిమితమైన వారికి ఉచిత వైద్యం అందజేశారు. తణుకు, చివటం గ్రామాల్లోని ఐదుగురు వృద్ధులు ఈ సేవలు పొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు అల్లూరి కరుణాకరచౌదరి, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ ఉచిత వైద్య సేవల కోసం 99853 43530 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న సిబ్బంది

అత్తిలి: స్థానిక పెదపేట చర్చిలో రాజమండ్రి డెల్టా ఆసుపత్రి వారిచే దాతల సహకారంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో గుండె వైద్య పరీక్షలు, ఈసీజీ, జనరల్ వైద్య పరీక్షలు చేశారు. అవసరమైనవారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పేదలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని వైద్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలిశెట్టి చందు, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావం విజయవంతం చేయాలి



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): విజయవాడలో జనవరి 5వ తేదీన నిర్వహించే హైందవ శంఖారావం విజయవంతం చేయాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, విశ్వ హిందూ పరిషత్తు సభ్యులు కోరారు. వారి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. భోగిరెడ్డి ఆదిలక్ష్మి, సుంకవల్లి రామకృష్ణ, స్వయం సేవక్ సభ్యులు పాల్గొన్నారు.

గౌతు లచ్చన్న సేవలు స్ఫూర్తిదాయకం



గౌతు లచ్చన్న విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): బీసీ చైతన్య వేదిక ఆధ్వర్యంలో భీమవరం పట్టణంలో గౌతు లచ్చన్న విగ్రహానికి ఆదివారం క్షీరాభిషేకం నిర్వహించారు. బీసీ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ గౌతు లచ్చన్న అన్ని వర్గాలకు చెందిన వారన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని దేశానికి సేవలందించారన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు మంత్రివర్గంలో వ్యవసాయ కార్మిక శాఖ మంత్రిగా 54 రోజులు పని చేశారన్నారు. ఆయన సేవలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు గుబ్బల నాగరాజు, కంచి సత్యనారాయణ, జంపన ధనరాజు, కుక్కల యుగంధర్, బాల పరమేశ్వరరావు, గంగారావు, బొల్లా శ్రీనివాస్, పితాని భాస్కరరావు, చెల్లబోయిన గోవింద్, బొక్క సూరిబాబు, గొలగాని రమేష్ యాదవ్, నమ్మి రామకృష్ణ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

రజకులకు ప్రత్యేక చట్టం ఏర్పాటు చేయాలి



సభలో మాట్లాడుతున్న రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య

భీమవరం: రజకులకు సామాజిక రక్షణకు ప్రత్యేక చట్టం ఏర్పాటు చేయాలని, వృత్తి చెరువులపై పూర్తి హక్కు కల్పించాలని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం భీమవరం పట్టణ ప్రథమ మహాసభ ఆదివారం యూటీఎఫ్ ఆఫీస్‌లో నిర్వహించారు. ఈ సభలో భాస్కరయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా రజకులకు సామాజిక రక్షణ చట్టం ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ మాదిరిగా ప్రత్యేక చట్టం చేయాలన్నారు. కుల వృత్తి చేసే రజకులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు, జీవో నంబర్ 27 ప్రకారం ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న దోబీ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఆదరణ పథకం ద్వారా అధునాతనమైన పరికరాలు అందజేసి, సిటీ కేంద్రాల్లో మోడరన్ దోబి ఘాట్లు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని కోరారు. అనంతరం నూతన పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మడక రాజు, ఉప్పులూరు చంద్రశేఖర్, రేవూరి గోగిరాజు, చంద్రిక మూర్తి, నర్మవిడి గంగాధర్, బేతపూడి లోకేష్, చింతాడి శ్రీనివాస్, మల్లెపూడి వెంకటేశ్వరరావు, యండమూరి నాగేంద్ర, తలుపురి నవీన్ కుమార్, చించినాడ ప్రసాద్ పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌కు బెంచీల బహూకరణ



బెంచీలను బహూకరిస్తున్న దృశ్యం

వీరవాసరం: రైల్వే ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామని రైల్వే బోర్డు సభ్యుడు జక్కంపూడి కుమార్ తెలిపారు. వీరవాసరం రైల్వే స్టేషన్‌లో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రయాణికులకు సౌకర్యవంతంగా, శుభ్రదంగా ప్రయాణం ఉండేలా రైల్వేశాఖ ప్రత్యేక శ్రద్ధ కనబరిచిందన్నారు. కాపు సంక్షేమ సేనా కాపు వనిత క్లబ్ ఆధ్వర్యంలో 15 సిట్టింగ్ బెంచీలను వీరవాసరం రైల్వే స్టేషన్‌కు అందజేశారు. రైల్వే ప్రయాణికుల సంక్షేమ ఫోరం ఆధ్వర్యంలో పలు వినతులతో కూడిన పత్రాన్ని రైల్వే బోర్డు సభ్యులకు అందజేశారు. నర్సాపురం నుంచి వారణాసి వరకు ప్రత్యేక రైలు నడపాలని, నరసాపురం టు హైదరాబాద్, బెంగళూరులకు వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లను ఏర్పాటు చేయాలని, ముఖ్యమైన రైళ్లను వీరవాసరం స్టేషన్‌లో నిలుపుదల చేసే విధంగా చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు. సమావేశంలో గుండా రామకృష్ణ, ఆకుల లీలాకృష్ణ, అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, సబ్బారపు వెంకటరావు, మద్దాల పుల్లారావు, వేంద్ర దివాకర్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు అభినందనీయం

భీమవరం: ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగమని, ఇటువంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం బ్యాంక్ కాలనీలోని కొప్పా కల్యాణ మండపంలో హైదరాబాద్ కాంటినెంటల్ హాస్పటల్ వారిచే ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించి మాట్లాడారు. కొప్పా అధ్యక్షుడు యర్రంశెట్టి హరినాథ్ హైదరాబాద్ కాంటినెంటల్ హాస్పటల్ అసిస్టెంట్ మేనేజర్ కొల్లి సోమేశ్వరరావు మాట్లాడుతూ ప్రముఖ కార్డియాలజీ, అంకాలజీ, ఆర్థోపెడిక్, గ్యాస్ట్రోఎంటరాలజీ, జనరల్ మెడిసిన్ వైద్యులచే ఉచితంగా అన్ని రకాల వైద్య పరీక్షలను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఆర్థోపెడిక్ డాక్టర్ చందు కృష్ణతేజ, గోపిశెట్టి మురళీకృష్ణ, అరేటి సత్యనారాయణ, చెనమల్ల చంద్రశేఖర్, యిర్రింకి సూర్యారావు, ఎంవి రమణ, యర్రంశెట్టి శివకృష్ణ, లంకి శ్రీనివాస్, కారుమూరి సత్యనారాయణమూర్తి, విజ్జిరోతి రాఘవులు, దాయన చంద్రజీ పాల్గొన్నారు.